# విడని ముడులు

డా॥ సత్యకృష్ణ

రిక్షా నత్తనడక నడుస్తోంది. నా మనసు జెట్ విమానంతో పోటీ పడుతోంది. వాచ్‌వంక పదేపదే చూచుకుంటున్నాను. దానివంక నేనెంత కోపంగా చూచినా అది నన్ను లక్ష్యపెట్టటం లేదు. ముళ్ళు ముందుకు పోతూనే వున్నాయి. నాదయినా పెద్ద పేరాశకాదు. కాలచక్రం ఓ కాస్సేపాగి తిరిగి నేను 'వూఁ' అనగానే దాని మానాన్నది ముందుకుపోతే చాలు!

తొందరకి ఆలస్యం .... మొగుడన్నది అక్షరాలా నిజం.

"ఈ రోడ్డుమీద బండి నాపటంకన్నా సింవాచలం అప్పన్నకొండ పైకి తొక్కయటం తేలికండి!" బండిదిగి నడిపిస్తూ అన్నాడు రిక్షావాలా.

మామూలు పరిస్థితుల్లో అయితే అతని డైలగ్‌ని అప్రిషియేట్ చేసేవాడినే. రిక్షా తొక్కటం మానేసి వారానికో నవలచొప్పున రాసుకుంటూ రాజాలా బ్రతకమని సలహా ఇచ్చేవాడినే అతని "సెన్స్ ఆఫ్ హ్యూమర్" కి సిగ్గుపడకుండా సలాం కొట్టేవాడినే–'ఆఫ్' చేయటానికి 'హేట్స్' లేవు కాబట్టి.

అవతల వెళ్తున్నది చాలా ముఖ్యమైన పని మీద. (ప్రతిమనిషి తన పని మాత్రమే అర్జంట్ అనుకోవచ్చు. అది నా కనవసరం) ఈమధ్య ఎందుకోమరి ఆ ట్రెయిన్ రైట్ టైముకి వచ్చేస్తోంది. అలా పంక్చువల్‌గా వొచ్చేస్తే ప్రజలకి దానిపట్ల గౌరవం సన్నగిల్లుతుందని ఏ రాజకీయ నాయకుడూ చెప్ప లేదులా వుంది ఆ ధూమ శకటానికి.

ఆలశ్యం అన్నదాన్ని ఏ విషయంలోనూ ఇష్టపడని మనిషి కొన్ని ప్రత్యేక సమయాల్లో లేట్ అవటాన్ని తానుగా కోరుకుంటాడు. సాదరంగా ఆహ్వానిస్తాడు కూడా.

ఒకటో తారీఖున కాబూలీ వాలా (ఈ రోజుల్లో వడ్డీ వ్యాపారస్థులే అందరూ–వీలయితే!) ఆఫీస్ దగ్గరికి కలెక్షన్స్ కోసం రావటం లేట్ అయితే బావుండు ననుకుంటాడు అప్పు చేసిన అప్పారావు – ఈ లోపుగా చల్లగా బయటికి జారుకోవచ్చని. నిండుగా ఉన్న జేబుతో కాస్సేపు ఖుషీగా తిరిగి నెల్లాళ్ళ కష్టాన్నీ మర్చిపోవచ్చని.

ప్రయాణం తెమల నప్పుడు బండి కొంచెం ఆలస్యంగా వొచ్చి సరిగ్గా తను వెళ్ళేటప్పటికి స్టేషన్లో వుండాలనుకుంటాడు మాస్టర్ లక్ష్మణస్వామి!! పెళ్ళాం పిల్లలకి పండుగ బట్టలు కొనలేని ఓ బక్క జీవి ఆ పండుగ ఓ ఏడాది ఆలశ్యంగా వొస్తే బావుండునని అనుకుంటాడు. "అదెలా సాధ్యం?" అన్నది అతనికి అనిపించదు. ఎలాగూ పరీక్ష తప్పటం నూటికి నూటఏభై పాళ్ళు గ్యారంటీ అని తెల్సిన విద్యార్థి పరీక్షా ఫలితాలు సాధ్యమైనంత ఆలశ్యంగా వొస్తే బావుండు ననుకుంటాడు – అంతవరకైనా ఫస్ట్ క్లాస్ వొచ్చే వాడితో సమానంగానో, ఇంకా ఎక్కువగానో ఫోజుపెట్టి తిరగొచ్చునని!!

ఈ ఆలోచన పరంపర మధ్య ఓ మెరుపులాంటి ఆయిడియా వచ్చింది.

"చూదయ్యా! యిక బండి ఆపేయ్ నువ్" అన్నాను.

"అదేంటి బాబూ! యింకో పర్లాంగ్ దూరమే కదాండీ టేషనూ?"

"అది తెలుసు లేవయ్యా."

అతను ఫ్రంట్ బ్రేక్ వేశాడులావుంది. ఓసారి వూగి ఆగిపోయింది. ఆజగన్నాధరథం ముందు బేరం ఆడినదాని ప్రకారం రెండు రూపాయలు అతని చేతిలో పెట్టి, నా చేతి సంచి తీసుకుని పరుగు లంకించుకున్నాను. ఎంత మంది నన్ను, నా పరుగును చూసి నవ్వుకున్నారో నాకు తెలియదు. వాళ్ళు నా గురించి ఏమని కామెంట్ చేసినా పట్టించుకునే స్థితిలో లేను నేనా సమయంలో.

ఎలాగయినా ఆ "ట్రైన్" కేచ్ చేయాలన్నదే అప్పటికి ముఖ్యంకాదు. ఆ 'పరుగు' వాహనం మీద స్టేషన్‌కి చేరేసరికి సరిగ్గా స్టేషన్లో వుంది నేనెక్కాల్సిన రైలు. టికెట్ కోసం కౌంటర్ దగ్గరికి చేరేసరికి గార్డు విజిల్ వూదేడు. టికెట్ గురించి ఆనక గార్డు గారితో ముచ్చటించొచ్చునని లోపలికి వెళ్ళబోయాను. కాని గేటు మూసేసి వుంది. లోపల యమధర్మరాజులాంటి ఓ టికెట్ కలెక్టర్ నిలబడి వున్నాడు. నల్ల వులెన్ కోటు వేసుకుని. బయట చాలా మంది జనం మూగి వున్నారు.

'కొంచెం గేటుతీయండి బాబూ' అని, 'బాబ్బాబూ' అని, 'బాబ్బాబ్బాబ్బాబ్బా' అని ప్రాధేయ పడుతున్నారు. అందులో

ఎక్కువమంది కూలీజనం. బహుశా పనికోసం మరోచోటికి వలస పోతున్నారేమో. ఆఖరికి కూలిపనికి సైతం ఎంతోదూరం వెళ్ళి వెతుక్కోవాల్సినంతగా రోజులు దిగజారిపోయాయన్నమాట. అని అనుకున్నాను నాలోనేను సానుభూతి చూపటంకన్నా చేయగలిగింది లేక.

"నో .. నో....రన్నింగ్ ట్రెయిన్‌లోకి ఎక్కనివ్వం. ఏదైనా యాక్సిడెంటయితే ఎవరు రెస్పాన్సిబుల్?" అని విసుక్కున్నాడు సదరు యమధర్మరాజు. అలా సగం సగం ఎంగిలి ఇంగ్లీషు మాట్లాడి, ఆ చదువుకోని జనంముందు పోజెందుకో?! అందరికీ అర్థమయ్యే అచ్చ తెలుగులో అఘోరించొచ్చుగా! అతని కోట్‌కు తగిలించి ఉన్న నేమ్‌ప్లేట్‌ని బట్టి గాని (మిస్టర్ కె. రామారావ్) నల్ల నేరేడు (ఎర్రనేరేడుందా?!) పండు రంగులో మెరిసిపోతున్న వాలకాన్ని బట్టిగాని అతని మాతృభాష ఇంగ్లీషు కాదని నా నమ్మకం!! అతని మాటలెలా వున్నా, భావం అర్థమయింది జనానికి రైలు దేవుడు గానూ, ఆ టికెట్ కలెక్టర్ పూజారి గానూ కనిపించి వుండాలి వాళ్ళకి ఆక్షణంలో.

అంతలో బండి కదిలింది.

నాలో ఆత్రుత పెరిగింది.

ఆ " యమధర్మరాజు " తో ఏదేదో మాట్లాడేను "ఏమనుకున్నాడో గాని ఒక్కసారి నా ఒక్కడి కోసం గేట్ తెరచాడు. నడుస్తున్న రైల్లోకి ఎక్కటం నాకంతగా అలవాటులేని పని. అవతల పని చూస్తే నే నారోజు వెళ్ళితీరాలి. అందుకే అన్నింటికీ సిద్ధపడుతున్నాను కాన్సిక్వెన్సెస్ గురించి మరచిపోతున్నాను. లోపలివాళ్ళు కొంచెం సహాయం చేశారు కాబట్టి క్షేమంగా రైల్లో ప్రవేశించాను. మరెవరో దయదల్చి కొంచెం చోటు ఇచ్చారు కూర్చోటానికి.

నా మనసు కుదటపడింది. గుండె దడ మాత్రం ఇంకా తగ్గలేదు. టక టక మని కొట్టుకుంటున్న దాని శబ్దం నా చెవులకి క్లియర్‌గా వినబడుతోంది. ఎప్పుడో చిన్నప్పుడు హైస్కూల్లో చదువుకునే రోజుల్లో తప్ప ఈ మధ్య ఇలా పరుగు తీత్త లేదు.

" థేంక్ ది యమ ! " అనుకున్నాను మనసులో అతనే గనక గేట్ తెరిచి ఉండకపోతే? ఏం ఉంది?! ఈ బండి దాటిపోను! ఆ తర్వాత ఇంత అర్జెంట్ పని సర్వనాశనం అయిపోను. ఇంకా ఎన్నో కాకూడనివి జరిగి ఉండును.

నే చేసిందల్లా ఏమీ లేదు. మాయ చేయలేదు. మంత్రం పెట్టలేదు ( ఆ మాటకొస్తే ఆ రెండింటినీ నమ్మని వాళ్ళల్లో ప్రథముణ్ణి నేను! ) నా గోడును ఇంగ్లీషులో చెప్పుకున్నాను. ఆంగ్లభాషలో ఆక్రోశించాను! అంతే! "యముడు" కరిగేడు. గేటు తెరిచాడు.

అతనికే కాదు. ఆంధ్రదేశంలో చాలా మందికి ఈ వీక్‌నెస్ వుంటుంది. దేశంలో యిన్ని రాష్ట్రాల ప్రజలుండగా తెలుగువాడికే ఈ దౌర్బల్యం ఎందువలన అని ప్రశ్నిస్తే సమాధానం నా దగ్గర లేదు తెలుగులో ప్రాధేయపడితే 'నో' అంటారు. యింగ్లీషులో దబాయిస్తే కిమ్మనకుండా పని


*With the Best Compliments from*

Grams : HOTELPURNA Phone : 59431 (8 Lines)

# HOTEL ANNAPURNA

AIR CONDITIONED BOARDING AND LODGING

**Nampally Station Road,**
**HYDERABAD-500 001.**

చేసి పెడతారు. ఆ ఆంగ్లభాష మాట్లాడేటప్పుడు వాక్యానికి వంద బ్లండర్స్ చొప్పున వున్నా ఫరవాలేదు! నిజానికి బూతుల్లేని (తప్పులులేని) కరెక్ట్ యింగ్లీషయితే వాళ్ళకి అర్థం కాదు కూడా!!

పాపం! ఆ కూలి జనం అంతా అలాగే స్టేషన్లో వుండి పోయి వుంటారు—యింగ్లీషులో ఏడవలేని కారణంగా! వాళ్ళమీద నాకు జాలి కలిగింది. నా కంటే చాలా సేపు ముందుగానే స్టేషన్ కొచ్చారు. వెనక వొచ్చిన నేను ముందుకి సాగిపోతున్నాను. యిది నిజంగా అన్యాయం!!! కాని ఏం చేయగలను.

వాళ్ళకోసం. ధర్మం కోసం నేను కూడా వాళ్ళతో పాటు వుండిపోయి నా పనులు నాశనం చేసుకోగలనా? పోనీ వాళ్ళని కూడా అవే చేయమని రిక్వెస్ట్ చేద్దామా అంటే అప్పుడు 'నువ్వు కూడా వెళ్ళొద్దు' అని నన్నూ ఆపేస్తే?

అసలు ఈ జీవితమనేదే ఓ పరుగు పందెం శక్తి యుకులున్నవాడు. బ్రతుకు తెరువు తెల్సినవోడు,అదృష్టం కలిసి వొచ్చిన వాడు ముందుకు సాగిపోతాడు. యివి లేని వాళ్ళు అలా కాళ్ళీడ్చుకుంటూ బ్రతుకును గడపాల్సిందే - ఆ ప్రయాణం శాశ్వతంగా ఆగిపోయేవరకు,

ప్రక్కస్టేషన్లో బండి ఆగిది. నా దగ్గర టికెట్ లేదన్న సంగతి గుర్తొచ్చింది. చిన్నప్పుడు చాలాసార్లు, యింకా నూరుశాతం నిజం చెప్పాలంటే ప్రతిసారీ, రైళ్ళల్లో టికెట్ లేకుండా ప్రయాణం చేసేవాళ్ళం. ప్రక్కటౌన్లో క్రొత్త సినిమా రిలీజ్ అవుతోందంటే చాలు మాబాచ్ మొత్తం స్కూల్ నించి గైర్‌హాజర్! సినిమాకి రైలుకి టికెట్ కొనటానికి సరిపడేలా డబ్బులుండేవి కావు. సినిమాకి టికెట్ లేకుండా ఎట్టిపరిస్థితుల్లోనూ వీలవ్వదు 'చెకింగ్ వాళ్ళ చేతుల్నించి తప్పించుకోగలిగితే. ఆ మాత్రం చాకచక్యం వుంటే రైల్వేస్ లో 'పైసా' వాటావున్నట్లే నని మా థియరీ! పెర్మనెంట్ ఫ్రీపాస్ వున్నట్లే!!

పెద్దయినాక కొన్ని పనులు చేయలేం. చేయకూడదు. వాటిలో టికెట్‌లెస్ ట్రావెలింగ్ ఒకటి. ఎవరైనా చెకింగ్‌వాళ్ళు పట్టుకుంటే పదిమంది ముందు బిక్కచచ్చిపోవాలి. పరువుగా బ్రతకటం ప్రారంభించాక అలా బిక్క చచ్చిపోవటం అసలు చచ్చిపోవటం కన్నా వెయ్యిరెట్లు ఎక్కువ బాధాకరం. ఫైన్ కట్టేసినంత మాత్రాన పోయిన పరువు తిరిగిరాదు బాధపడటం మానేయదు మాయ నసు.

ప్లాట్‌ఫారం మీదికి దిగి గార్డు దగ్గరికి వెళ్ళాను.

గ్రీట్ చేశాను.

"సార్ నా దగ్గర టికెట్ .. "

"అది చాలా పెద్ద అఫెన్స్" నా మాటలు పూర్తి కాకుండానే అందుకున్నారు గార్డుగారు.

"నేను బండి బయల్దేరాక ఎక్కేను సార్" నసిగేను.

"అది చాలా డేంజరస్ మీలాంటి చదువుకున్న వాళ్ళకి కూడా మేమే చెప్పాలా? సపోజ్ మీరలా మూవింగ్ ట్రెయిన్ లోకి ఎక్కటంకోసం పరుగెత్తుతుండగా ఏ అరటిపండు తొక్క మీదయినా కాలు వేశారనుకోండి. అప్పుడేం అవుతుంది? వెధవది ఈబండిపోతే దీనివెనకవచ్చేది దొరుకుతుంది, కాలుపోతే కాలొస్తుందా? ప్రాణంపోతే తిరిగి ప్రాణం వస్తుందా? చెప్పండి?" తండ్రి కొడుకును దులిపినట్లు దులిపేశాడాయన స్కూల్లో టీచర్ కుర్రాడ్ని మందలించినట్లు జాడించేశాడు. (నేచెప్పేది పాతరోజుల్నాటి టీచర్ గురించి, ఆ రోజుల్లో విద్యార్థుల గురించి!)

నాడాల చెప్పుతో కొట్టినా, హవాయి చెప్పుతో కొట్టినా అది చెప్పుదెబ్బే అవుతుంది. ఆయన మాటలు అలానే వున్నాయి. గౌరవంగా తిట్టినట్లు! ఏమండీ వెధవగారూ అని అన్నట్లు!!

అయినా ఆయన చెప్పిందంతా నిజమే నా మంచికోరే. అయినా కళ్ళముందు ఒంటికాలు సీన్. వల్లకాడు దృశ్యం సృష్టించి చూపేసరికి కొంచెం బాధ వేసింది నాకు—తప్పు నాదని తెల్సినా సరే!

తెల్సి తెల్సి తప్పు చేయటం, ఎవరైనా మందలిస్తే సహించలేక పోవటం, చేసిన తప్పును సపేమిరా ఒప్పుకోకపోవటం, యివన్నీ పెద్దయ్యే కొద్దీ వొచ్చే చిన్న లక్షణాలు! చిన్నతనంలో అది 'తప్పు' అని తెలియక చేస్తారు పిల్లలు. మందలిస్తే తప్పు తెల్సుకుంటారు అంటే దీని ప్రకారం పెద్ద మనిషి కన్నా, 'చిన్న' మనిషే బెటర్ అన్నమాట! అలా అని చెబితే కనీసం ఒక పెద్ద మనిషి కూడా ఒప్పుకోడు. అంతెందుకు? ఈ మధ్యనే పెద్దాళ్ళ లిస్టులో చేరిన నేనే ఒప్పుకోను!

"చాలా అర్జంట్ పనిమీద వెళ్తున్నానండి." నన్ను నేను సమర్థించుకోవటానికి ప్రయత్నించాడు.

"చూడండి మేష్టారూ! తప్పు చేయటం చిన్న తప్పే. దాన్ని సమర్థించుకోవటం మాత్రం చాలా పెద్ద తప్పు. అండర్ స్టాండ్ పని అంత ముఖ్యమైనదైనప్పుడు కాస్త పెందరాళే బయల్దేరి స్టేషన్‌కి చేరుకోవాలి. అంతేగాని రిస్కీగా ప్రవర్తించ కూడదు. పెళ్ళయి పెళ్ళాం పిల్లలున్నాక కుర్రకారులా ప్రవర్తిస్తే ఎలా? జాగ్రత్త నేర్చుకోవద్దూ?" చిన్నప్పటి మోరల్ క్లాస్ గుర్తుకొచ్చింది ఆయన మాట్లాడుతుంటే.

ఆయనతో వాదించి గెలవటం దుస్సాధ్యం అనితేలిపోయింది. ఆయన చెప్పేవన్నీ నగ్న సత్యాలు! పైపెచ్చు నా మంచికోరి చెబుతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఆయనతో పని వుంది నాకు.

"సార్! అలా చేయటం తప్పేనండీ!" అన్నాను.

ఆయన ముఖం చాటంత అయిపోలేదు గాని మొత్తం మీద వెడల్పు అయింది సంతోషంతో విప్పారి.

మనం చెప్పిన ముక్క ఎదుటి వ్యక్తి తలకెక్కించుకున్నాడంటే ఆనందమేగా మరి!—అందునా ఈ ఇరవయో శతాబ్దంలో! నిజానికి ఈరోజుల్లో అంతా చెప్పేవాళ్ళే గాని, వినేవాళ్లు వినిపించుకునేవాళ్ళు చాలా అరుదు.

"సార్! ఏలూరుకి ఓ టికెట్ రాసివ్వాలి సార్ మీరు" అన్నాడు. అంతకుమించి ఎక్కువసార్లు సార్ అంటే అతి వినయం కింద, అది ధూర్తలక్షణం అని పసిగట్టేయగలరాయన. అందునా చాలా తెలివైన గార్డులా ఉన్నాడు.

"సారీ! నేను రాయకూడదండీ. దానికి వేరుగా ఒకాయన ఉన్నారు ఈ బండిలోనే. ఆయన్ని వెదకి పట్టుకునే అవస్థ పడలేకపోతే ఈ స్టేషన్‌లోకి వెళ్ళి తెచ్చుకోండి. గేట్‌లో అడిగితే నా పర్మిషన్ తీసుకున్నానని చెప్పండి. ఈ ట్రైనుకి ఎలాగూ క్రాసింగుందిక్కడ. ఇంకా పది నిముషాలకు

గాని మనబండికి విముక్తిలేదు. వెళ్ళి త్వరగా రండీ" అన్నాడాయన.

పరుగు పరుగున బయల్దేరాను స్టేషన్‌లోకి టిక్కెట్టు తెచ్చుకోటానికి. తప్పు దిద్దుకోటానికి. మచ్చను మాపుకోటానికి.

టికెట్ చేతికి రాగానే ఎంతో సంతోషమయింది. ధైర్యం వచ్చింది. మెడ నిటారుగా నిలబడింది. వెన్నెముక్కి సత్తువొచ్చింది. కోహినూర్ వజ్రం దొరికినట్లనిపించింది.

బాగా పరితపించాక దొరికితే ఆ వస్తువ విలువ పెరుగుతుంది కాబోలు! అంతే కాకపోతే ఆఫ్టరాల్ మూడు రూపాయలు ఎదురిచ్చి కొనుకున్న టికెట్‌ను చూసి యింత మురిసి పోవటం ఏమిటి?!!

ఈ సారి కొంచెం ఆయాసం తక్కువగా ఉంది పరిగెడుతుంటే అంటే పరిగెత్తటం అలవాటయి పోతోందన్నమాట! కష్టాలూ ఇంతే కాబోలు. రోజూ కష్టాలయితే కొన్నాళ్ళకి కష్టమే సుఖంగా అనిపిస్తుందా ఏవిటి కోపందీసి? అందుకేనా ఈ ప్రపంచంలో బీవాళ్ళంతా బ్రతకగల్గుతూంట?

పరుగులోనూ వదలవునన్ను ఆలోచనలు.

"ఎందుకండి ఆ ఉరుకులు. పరుగులు బండి చాలాసేపుంటుందని చెప్పేనుగా? నేను బండిదగ్గరకు రాగానే నా పరుగును చూసి నా చాదస్తానికి ఓ చురక వేశారు గార్డుగారు.

త్వరగా రండి అని హెచ్చరించిన ఆయన తిరిగి తానే అలా అనటం నాకు నచ్చలేదు అయినా ఆమాట్లాట్టంలో ఆయన్ది మాటలు అనే ప్రాత, నాది మాటలు పడే పాత్ర!! అంతే గుర్తుంది నాకు. అందుకు ఏమన్నా భరిస్తున్నది.

"చాలా థేంక్సండి" అంటూనే ముందు కెళ్ళి పోయాను—అక్కడ నిలబడి మాటలనిపించుకోవటం యిష్టం లేక! నీతులు బాగా వింటున్నాడని ప్రేమగా తన పెట్టెలో ఎక్కించుకుని, బండి దిగేవరకూ తినేసేంతటి గట్టివారులా వున్నాడాయన!! టికెట్ నా చేతికి రాగానే ఆయన పట్ల చిన్న చూపు కల్గింది నాకు. యిది వాస్తవమే!!

నా కంపార్టుమెంటులోకి ఎక్కగానే అప్పటి వరకూ ఎవ్వరూ అధిరోహించని పర్వత శిఖరం చివర నేనే తొలిసారిగా నిలబడినట్లయింది — దానిక్కారణం నా జేబులో టికెట్!!

అప్పటి వరకు నేను కూర్చున్న నా సీటు కనిపించలేదు. వేరే ఎవరో కూర్చున్నారు.

నా 'ప్లేస్'కి కాపలా బాధ్యత వొప్పగించిన వ్యక్తి వంక ప్రశ్నార్ధకరంగా చూశాను—'ఏవయ్యా పెద్దమనిషీ? జాగ్రత్తగా చూస్తూండు నా సీటు అంటే నువ్వు చేసిన నిర్వాకం యిదా?' అన్నట్లు.

నా వుద్దేశ్యం అర్ధమయినట్లుంది మహానుభావుడికి— ట్యూబ్‌లైట్ కాదన్న మాట!

"నేను చెప్పేను బాబూ! యిక్కడో బాబున్నాడు. యిప్పుడే కిద కెళ్ళాడు. మళ్ళీ వత్తాడని ఆ ఆడమడిసి ఎన్ని సెప్పినా యినకుండా సతికిలపడిపోయింది. అక్కడితో తన బాధ్యత తీరిపోయిందన్నట్లు, తనలోటు ఏమీ లేదన్నట్లు, యింతకు మించి ఏం చేయగలను అని ప్రశ్నించినట్లు చెప్పాడు సదరు కాపలా దారుడు.

నేనేమీ అనలేదు.

అలా దురాక్రమణ చేసిన "ఆడమడిసి" వంక చూశాను. చాలా మోటుగా వుంది. ఆ బండ విగ్రహానికి తగినన్ని నగలు వ్రేలాడుతున్నాయి. వొంటి మీద వివిధ ప్రదేశాలో అదే నగలతో అలంకరిస్తే ఆ సైజులో వున్న యింకేజంతువైనా సరే ఆమెకన్నా ఎన్నోరెట్లు అందంగా వుంటుంది. ఆమె నావంక నిర్లక్ష్యంగా చూసింది — 'ఏం చేస్తావయ్యా?' అన్నట్లు ఆ చూపుల ధాటికి తట్టుకోలేక చూపులు నా దగ్గరకే తిరిగొచ్చేశాయి — గోడకేసి కొట్టిన బంతిలా మీసాల బాబాయి దగ్గరకెళ్ళనని మారాంచేసి, అమ్మ ఒడిని చేరిన బెదరిపోయిన పాపా యిలా!

అంతలో నాకో చక్కని సామెత గుర్తుకొచ్చింది.

యిలాంటి మొండి వాళ్ళని తాళికట్టిన మొగుడే ఏమీ చేయలేడంట! ఏమీ కట్టని నేనేం చేయగల్ను?! తన్ని బుద్ధి చెప్పటానికి అర్హత, హక్కులున్న మనిషే కుక్కిన పేనులా బ్రతుకుతూంటే (నా వూహ సాధారణంగా తప్పుకాదు.) నేను ఈ కాస్సేపటిలో. బండిదిగేలోపల ఏమాత్రం జ్ఞానాన్ని తొలగించగలను అవిశ చేత?.

"అందుకని ఏం చేయాలంటావ్?" నా లోపలివాడు నన్ను విషయానికి రమ్మని ఆదేశించాడు. వూరికే సోది మాట్లాడొద్దని విసుక్కున్నాడు! వాడీమధ్యంతా అసలుపాయింట్ల నడుస్తున్నాడు లెండి!!

"ఏం వుంది. మెదలకుండా వూరుకోవటమే! అలాంటి బండ శాల్తీలతో గొడవ పెట్టుకుంటే సీటుతో పాటు, యిన్నాళ్ళూ పీటుగా పెంచుకొస్తున్న పరువు కూడా పాడయిపోవటం ఖాయం." చప్పగావున్నా అగ్ని సరెండర్ అయిపోతున్నట్లున్నా, ఎందుకో ఈసారి మాత్రం నాతో ఏకీభవించాడు నాలోనివాడు — ఓడిపోవటం ఖాయం అని తెల్సిన అభ్యర్థి. ప్రత్యర్థినుంచి డబ్బు తీసుకుని ఎలెక్షన్ నించి గౌరవంగా విత్‌డ్రా చేసుకున్నట్లు!

ఫలితంగా నేను నిలబడి వుండాల్సొచ్చింది మిగిలిన పదిమంది పెద్దవాళ్ళూ, యిద్దరు పిల్లాళ్ళూ కూర్చున్నారు.

"ఎవరెక్కడ దిగుతారో కనుక్కుంటే తెల్సిందేమిటంటే. అంతా బండి అంతు చూసేవాళ్ళేనట!! అంటే నాకు లాగే బండి ఆగిపోయేవరకూ, ఆఖరి స్టాప్ వరకూ వెళ్ళేవాళ్ళేనట! నాకు ఆశ్చర్యం వేసింది అందరికీ అదే వూళ్ళో పనులా? అని.

సీటు కోసం కంపార్టుమెంటంతా తిరిగి ప్రయత్నించాలనిపించలేదు. కాస్సేపు నిలబడితే నష్టం లేదని సరిపెట్టుకున్నారు. ప్రధాని ఆరోగ్యం గురించి గుర్తొచ్చింది. అకస్మాత్తుగా వయసులో ఎనభైనాల్గో ఏట యువకులు కన్నా ఆరోగ్యంగా వుండటం ఆశ్చర్యకరమే. అంత చక్కని ఆరోగ్యాని క్కారణం "స్వమూత్రపానం" మాత్రం కాదని నా విశ్వాసం. యూరిన్ అంటే వేస్ట్ మేటర్ ప్లస్‌వాటర్! అది అమృతం ఎలాఅవుతుంది? అలా ఒప్పుకంటే మూర్ఖత్వమే అవుతుంది. పెద్దవాళ్ళు కదా అని ఏం చెప్పినా నమ్మేయక్కర్లేదు. కొంత స్వంత బుర్రకి కూడా అలోచించాలి. ప్రతీ మనిషీ... నా ఆలోచనలు ఆగిపోవాల్సొచ్చింది.

"మాటలు జాగరతమ్మో! మా కాడా టిక్కెట్టులున్నాయ్ నీ యిట్టమొచ్చినట్లు కూ తే ఈడెవరూ ఊరుకోరు." ఈ మాటలన్నది 'ఓ ఆడపేసింజర్'

★

# విడని ముడులు

*(80 వ పేజీ తరువాయి)*

ఏదో చిన్నసైజు వియత్నాం వార్ ప్రారంభం అయినట్లుంది.


ఆవిడికి ప్రత్యర్థి ఎవరా అని నేను తల బ్రద్దలు కొట్టుకోవాల్సిన అవసరం లేక పోయింది. ఆ మనిషి మాట పూర్తి కాకుండానే అందుకుంది. నా సీటు కాజేసిన "ఆడ మడిసి".

"ఒక్కసారేం ఖర్మ? వందసార్లంటాను. ఏం చేత్తావో చేసుకో. ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో." అని విదిలించేసింది. "ఆడ మడిసి". నాకు గుండె ఝల్లుమంది ఆఖరికి "ఫస్టుసిటిజన్" అయిన ప్రెసిడెంటు ఆఫ్ ఇండియా కూడా అంత అలా మాటలాడరు!! ఈవిడ ఆయన కన్నా పెద్దా హోదాలో?? మరి ఈవిడగారి వెనక ఏపాటి బలం వుందో? ఓ పాతిక ఎకరాల మాగాణి (ఆవిడ పేర) వుండి వుండొచ్చు. వడ్డీ వ్యాపారంలో తాకట్లు వాకట్లుగా మారగా ఓ కేజీ బంగారం పోగయ్యుండొచ్చు. కొంత రొక్కం కూడా వుండి వుంటుంది. అదే ఆవిడ ధైర్యానికి కారణం. పాత రోజుల్లో ఎలిజబెత్ మహారాణీలా ఫీల్ అయిపోతోంది. అన్నిటికంటె ప్రత్యర్థి "ఆడ పేసింజర్" బీదవాలకమే ఈమె ధైర్యానికి మూల కారణం!!

"యాఁవమ్మో! నాకాడ బంగారంగట్రా లేకపోవచ్చు లచ్చలు. ఏలు లేకపోవచ్చు. నువ్వేదంటే అది నేనెందుకు పడాల? మళ్ళీ గనక యింకోసారి ఆ మాట గనక అన్నావంటే వూరుకోను. ఆఁ" బీద పేసింజర్ తిరగబడింది.

నాకు చికాకొచ్చింది. అసలు గలాటాకి కారణం తెలియటం లేదు. అందులో నా తప్పుకూడా కొంత వుంది. వెధవది నా ఆలోచనల్లో నేనుండి మొదట్నుంచీ వినలేక పోయాను. అందుకే అసలు సంగతి అర్థం కావటంలేదు. ఊహకి అందటం లేదు కూడా.

"ఏం చేత్తావే? మళ్ళీ అంటాను. ఆ ఎదవ కంపంతా నీ గురించే. నీకాడ నించే వొత్తందది. అందులో అనుమానం లేదు. బండెక్కిన కాడ్నించి సూత్తన్నా భరించలేక చత్తన్నాను తల బద్దలయి పోతున్నాది




పోటొచ్చి. నన్నేదన్నా చేయటానికి నీతల్లో జేజమ్మ దిగి రావాలే తెల్సిందా?" ఆడ మడిసి గాడిదలా ఓండ్ర పెట్టింది, కుక్కలా "భౌ,భౌ" మంది పులిని. సింహాన్ని అవమానించే వుదేశ్యం నాకులేదు కొబట్టి వాటి అరుపులతో పోల్చలేదు "ఆడమడిసి" కేకల్ని.

అప్పటికి నాకు అసలు సంగతి అంతు పట్టింది.

"సూడండయ్యా. ఈ అమ్మెలా మాట లాడతున్నాదో. నాకాడ ఏటుందని ఎదవ కంపొస్తున్నాది బాబూ. ఇందాక పచ్చిశాపల గంప లెట్టారిక్కడ. నేను ఎక్కతావుంటే దింపటం సూశాను. ఆ గంపల్లో నీళ్ళుకారి ఈడంతా బంద బందయిపోయి కంపొస్తున్నాది. ఈయమ్మ నాకాడంటాదేంటి బాబూ? కూటికి లేకపోతే మాత్రం మా వొళ్ళు కంపొచ్చేత్తాదేటి బాబూ? ఓ" బుంగ మీసాల ఇద్దరు పంచిని మధ్యవర్తిగా ఎన్నుకొంది "ఆడ పేసింజర్".

ఈయనైతే మాత్రం నాకు లెఖ్ఖా అన్నట్లు చూసింది "ఆడమడిసి".

"ఎందుకొచ్చిన గొడవ వూరుకోమ్మా! పాపం ఆ మనిషి చెప్పింది నిజమే. నువ్వప్పటికి బండెక్కలేదు. చాపల గంపలు దింపినమాట వాస్తవమే" అన్నాడాయన. నిజంగా కూడా నిజమే ఆమాట.

"ఎందుకూరుకోవాలి?" ఎదురు తిరిగింది "ఆడమడిసి".

"వూరుకోపోతే ఏం చేస్తావ్? ఇందాకటి నుంచీ చూస్తున్నా. ఏఁవిటి నీ ఆగడం?ఏఁవి చూసుకుని ఎగిరి పడటం? ఏం మేం అంతా మనుషులం కాదా? మేం ప్రయాణం చేయటం లేదా? నువ్వేదో పై లోకాన్నించొచ్చినట్టు మాటలాడుతున్నావే? అమాయకంగా దొరికింది కదా అని ఆ మనిషిని పట్టుకుని ఇందాకట్నించి సతాయిం చేస్తున్నావ్. కాస్సేపుంటే అందరూ దిగిపోయే వాళ్ళమే. ఈ లోపుగా నీ గోల ఏఁటి? నువ్వు గనక ఊరుకోకపోతే వచ్చే స్టేషన్‌లో పోలీసుల కప్పగిస్తా న్యూసెన్సు కేస్ పెట్టి." శివతాండవంలా నిలబడి మరీ అన్నాడాయన ఈ మాటలు—ఎఫెక్ట్ కోసం.

అంతే! "ఆడమడిసికి" పట్టిన దయ్యం దిగిపోయింది! మరి మాట్లాడలేదు ఆడ పేసింజర్ కృతజ్ఞతగా చూసింది ఇద్దరు పంచి వంక. నేను కూడా సంతోషించాను లోలోపల!

కట్టుకున్నది వాయిలుచీరయినా శుభ్రంగా వుంది ఆడ పేసింజర్ చీర. చిరుగులు, అతుకులు వున్నాయి. అది శుభ్రతకి అడ్డేముంది? తలకి నూనే రాసుకుని ముడేసుకుంది శుభ్రంగానే వున్నట్టు లెఖ్ఖ.

ఆ మాట కొస్తే "ఆడమడిసి" కట్టుకున్న ఖరీదయిన చీరని ఏడాదికోసారయినా వుతక్కపోవచ్చు. రంగు దిగిపోతుందని, చెమ్కి దెబ్బతింటుందని తలకి నూనె రాస్తే ఖర్చని, డబ్బు వృధాఅని వీధిలో కొచ్చినపుడుతప్ప తైల సంస్కారం చేస్తూండక పోవొచ్చు. సబ్బు

వాడే అలవాటుంది వుండదు. "ఆడమడిసి"కి వుతకని చీర, నిత్యం నూనె ముఖం చూడని జుట్టు, సబ్బంటే తెలియని ఆమె ఒళ్ళు "కంపు"కి నిలయం "కావచ్చు" యిదంతా నా వూహేగాని నాకున్న వైరం వల్ల చెబుతున్న గిట్టని మాటలు కావు సుమా!

ప్రతిసారీ నా ఆలోచనలకి ఏదో ఒక ఆటంకమే.

"సార్? చుట్ట వాసన పడదు. కొంచెం కాల్చడం మానేస్తారా?" ఖద్దరు పంచెని రిక్వెస్టు చేసిందో "టెర్లిన్ పాంట్."

"ఇది లంక పుగాకండి. ఎంతకమ్మదనమో తెలుసా? అందుకే కదంటీ గీనికి బానిసయి పోయిందీ. మా బామ్మరిది నెలకోసారి ప్రత్యేకంగా మనిషి చేత పంపిస్తాడండి నా కోసం. పని మీద హైదరాబాదు వెళితే మళ్ళీ అక్కడ దొరకక యిబ్బందవుద్దని ఓ అరకేజీ కూడా తీసుకుపోతానండి. హిహిహి....." తనివితీరా దమ్ములాగుతూ పొగ వదులుతూ గిరీశం పోజులో చుట్ట మీద లెక్చరిచ్చాడాయన.

"మా ఫేమిలీకి చుట్ట వాసన తగిలితే చాలు వాంతులవుతాయి. అసలే ఆవిడ ఆరోగ్యం మంచిది కాదు. దయచేసి అవతల పారెయ్యండి." మెత్త మెత్తగా వార్నింగ్ యిచ్చాడు "టెర్లిన్ పాంట్".

అంతా తన వంకే చూట్టం చూసి, ఆనక గనక ఆయనగారి ఫేమిలీకి వాంతులయితే అంతా తన్ని ముద్దయిగా చూస్తారని జడిసి చుట్ట తీసి కిటికీలోంచి అవతలికి పారేశాడు పారేసే ముందు ఓ గట్టి దమ్ములాగేడు కూడా.

"చుట్ట చెడ్డదని ఈ యింగ్లీషు డాక్టర్లంతా గోల చేస్తారే కాని నిజానికి యిది ఆరోగ్యానికి చాలా మంచిది. సిగరెట్టు చెడు అంటే నేనూ ఒప్పుకుంటాను. దానికీ చుట్టకీ సంబంధమే లేదు. నా మటుకు నాకు చిన్నప్పుడే ఆయాసంగా వుంటే మా నాన్న స్వయంగా ఒళ్ళో కూర్చోబెట్టుకుని నేర్పించేడండీ——" అతని చుట్ట పురాణాన్నిగాని, మూర్ఖ వ్యాఖ్యానాన్నిగాని ఎవరూ ఖాతరు చేయటం లేదని తెల్సి మధ్యలో చెప్పటం ఆపేశాడు ఖద్దరు పంచె.

"సిగరెట్ లోను, చుట్టలోనూ పుగాకే కదా వుండేది. వేరంటాడేంటి? ప్రపంచములో అన్ని చోట్లా "స్మోకింగ్ హజార్డ్సు" గురించి ధూమపానం వల్ల వొచ్చే "లంగు కేన్సర్" గురించి వైద్యులు గగ్గోలెత్తిపోతోంటే అది ఆరోగ్యానికి మంచిదంటాడేంటి ఈయన? పరిశోధనలు చేసే శాస్త్రజ్ఞులికి ఈపాటి తెలియకా? ఈపాటి అజ్ఞానం మూఢత్వం, మూర్ఖత్వం లేక అయి వుండొచ్చు. నాకు నవ్వొచ్చింది. కాని పకపకా నవ్వితే నా మీద న్యూసెన్సు కేస్ పెడతాడని నవ్వలేదు. అసలే ప్రెస్టేజీకి డేమేజ్ అయిపోయి, ప్రాణప్రదమైన లంక చుట్టకి దూరమై బాధపడుతున్నాడు. నా నవ్వు గోరుచుట్టుపై రోకలిపోటు. అగ్నిలో ఆజ్యం కాగలదు.

ఈ ప్రపంచంలో ప్రతి మనిషికి ఏదో ఒక బలహీనత వుంటుంది. కొందరివి పది మందికీ కనిపిస్తాయి. కాస్త తెలివైన వారయితే దాన్ని ముసుగులో కప్పి పెడతారు. మన బలహీనత మరొకరికి, సంఘానికి ఇబ్బందిగాని, నష్టం గాని కాకుండా వున్నంత కాలం ఫరవాలేదు. ఎంతసేపూ మనం అనుకున్నదే కరెక్టు అనుకుంటే పప్పులో కాలేసినట్లే. అన్నీ నాకే తెల్సు అనుకుంటే పాతాళం వేపు ప్రయాణం ప్రారంభించినట్లే. ఎదుటి వాడికేమీ తెలియదు అనుకుంటే అజ్ఞానం పైన ఆధిపత్యంకోసం ప్రాకులాడుతున్నట్టు, జ్ఞాన నేత్రాన్ని అరికాలితో తన్నినట్టే.

ఎదురైన ప్రతి సంఘటన్ని నిశితంగా పరిశీలించటం, అందులో విశిష్టత ఏమన్నా వుంటే నా మనోఫలకం మీద ముద్రించుకోవటం నాకున్న వ్యసనం. ఈ బలహీనత వలన మనుష్య"ల్లోపల మనుష్యుల్ని" తొంగి చూసే కళ నాకబ్బొచ్చు తప్ప ఎవ్వరికీ ఏ విధమైన హాని వుండదని నేను విశ్వసిస్తాను.

రైలుబండిలోనూ, కిక్కిరిసిన, బజార్లలోనూ ఆలోచించటం ప్రారంభిస్తే ఎంత సేపు సాగుతుంది? అడుగడుగునా బ్రేక్ లే.

నేను నిలబడ్డ చోట వున్న జనాభాలో ఓ యిద్దరు చిన్న కుర్రాళ్ళున్నారన్నానుగా. అమాంతంగా వాళ్ళిద్దరూ శత్రువుల్లా మారిపోయారు. పిల్ల శత్రువులన్న మాట.

కిటికీ ప్రక్కన కూర్చున్న నల్ల పిల్లాడిని అక్కడ్నించి లేచిపోయి తనకా సీటు యిమ్మని కాలితో తన్నుతున్నాడు. ప్రక్కనే కూర్చున్న ఎర్ర కుర్రాడు, నల్ల పిల్లోడు సన్నగా వున్నాడు. చొక్కాలేని అతనికి జీవనదిలాంటి చీమిడి ముక్కుంది. లావు లావు బుగ్గలు లేకపోయినా మిలమిలమెరిసే చక్రాలాంటి రెండు పెద్ద కళ్ళున్నాయి. వాళ్ళ నాన్న వేయించిన అంత కత్తెర క్రాపులో ఆకర్షణీయంగా వున్నారు. పక్కనే కూర్చున్న వాళ్ళ నాన్న వంక చూస్తున్నారు చూడు నాన్న ఈ అన్యాయం అన్నట్లు వాడి తండ్రికి చొక్కా బదులు కండలు తిరిగిన ఒళ్ళుంది. "నల్లరాతి నంది"లా వున్నాడు. అతనేదో ఆలోచిస్తున్నాడు కిటికీలోంచి బయటికి చూస్తూ కొడుకు గోడు పట్టించుకోరేదు.

ఎర్ర కుర్రాడు పిల్ల వస్తాదులావున్నాడు. చిన్న సూట్ లాంటి రెడీమేడ్ డ్రెస్ వేసుకున్నాడు. హిందీ సినిమాల్లో ధనవంతుల చిన్న పిల్లోడి క్రాపు, బుగ్గలు, అలంకరణ అన్నీ వున్నాయి. దర్పం సరేసరి. అయినా నా కళ్ళకి ఏదో వెలితి అనిపించింది. "బొమ్మల కొలువులోని బొమ్మలా"గున్నాడే గాని ఆకర్షణలేదు ఆ రూపంలో.

తండ్రి మద్దతు యిక ఎలాగూ రాదని నిశ్చయించుకున్నాడు కాబోలు నల్లబ్బాయి లాగి ఒక్కటి తన్నేడు. ఎర్రబొండు పొట్టలో. వాడు హెచ్చు శృతిలో ఏడుపు రాగాలాపన ప్రారంభించాడు. అప్పటికిగాని పెద్ద వాళ్ళకి విషయం తెలియలేదు.

"దానికేటి బాబూ! రండి! తమరే కూకోండి" అంటూ తన పిల్లాడ్ని అక్కడ నుండి తీసి ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు "నల్లరాతి నంది" ఎర్రబొండు కిటికీపక్కన కూర్చుంటూ కాలెగరేశాడు. ఏదో సినిమాలో చూసుంటాడు. పాపం నల్లబ్బాయి బిక్కమొగం పెట్టాడు.

అదంతా చాలా అన్యాయం అనిపించింది నాకు. పిల్లలంతా సమానమే. వాళ్ళ మనసులన్నీ ఒక్కటే. ఒకర్ని తృప్తి పర్చటం కోసం మరొకరి మనసును గాయపెట్టటం అధర్మం కాదా? ఒకరి సంతోషం కోసం మరొకర్ని హీనంగా చూడటమూ యివన్నీ నాలోనే వుండిపోయిన సందేహాల, ప్రశ్నల పరంపర.

ఈ సందేహాల్ని ప్రజల ముందుంచితే నాకు 'పిచ్చిమారాజు' బిరుదాన్ని ప్రదానం చేసే ప్రమాదం వుండటం వలన వాటిని ఓ జీవిత కాలానికి 'ఫిక్సెడ్ డిపాజిట్' లో

వేశాను. నా జ్ఞాపకాల, హృదయ ప్రకంపనాల బ్యాంకులో దీనివలన చివరికి ఆ మొత్తం ఎంతవుతుందో నాకు లెక్క తెలియదుగాని ప్రస్తుతానికి మాత్రం నా పరువు నిలబడుతుంది.


నాకు పడుకోవటానికి సరిపడే స్థలం యిస్తామని ఎవరైనా అభిమానంగా ఆహ్వానించినా సరే వెళ్ళకూడదనుకున్నాను. ఇక్కడ నాకు దొరుకుతున్న అనుభవాలు నాకిస్తున్న తృప్తి ముందు ఆ 'పడకసుఖం' ఏపాటి? వింతగా లేదూ నా తీరు? అసలు యింకెంత సేపు? మరో యిరవై నిముషాల్లో దిగాల్సిన స్టేషను వొచ్చేస్తుంది ఎలాగూ. అదే ట్రెయిన్‌కి కూడా ఆఖరి స్టేషన్. అందరూ దిగాల్సిందే. ఈ కాస్సేపటి కోసం సీట్ కోసం ప్రాకులాడటం ఎందుకు? యింత సేపూ నిల్చున్న వాడిని ఈ కాస్సేపు నిలబడలేనా?

బండి ఏదో చిన్న స్టేషన్లో ఆగింది. మేం వున్న చోటికి ఓ మల్లెపూల గంపొచ్చింది. అమ్మకానికి కాదు. బండెడు మల్లెల్ని మోయలేనన్ని దండలుగా సిగలో ధరించిన ఓ వయ్యారి. మాంచి పరువంలో వున్న ఓ చిన్నారి ఆ స్టేషన్లో ఎక్కింది. వచ్చి మా దగ్గర నిలబడింది.

ఆమె కూడా ఏ మగ పురుగూ లేని కారణంగా, ఆమెపై హక్కులు అందరికీ వున్నాయన్నట్లు అక్కడున్న మగాళ్ళంతా ఆమెను కొరుక్కుతినేసేలా చూస్తున్నారు కూడా. భార్యలతో ప్రయాణం చేస్తున్న భర్తలు మినహా పాపం. ఆ భర్తలు మాత్రం శ్రీరామచంద్రుని పాత్ర ధరించాల్సిన అవసరం. అగత్యం ఎంతయినా వుంది. ఆ కాస్సేపు కక్కుర్తివడి దృష్టిని ఆ అందాల బొమ్మవైపు పోనిస్తే, యిల్లాలు బ్రతికినంత కాలం దెప్పి పొడుస్తుంది.

ఆ మాత్రం కనీస జ్ఞానం లేని మగాళ్ళుగాని, మొగుళ్ళుగాని వుంటారా? ఒకవేళ వుంటే? అసలుండే వాళ్ళో లేదో తెలియని పతివ్రతా శిరోమణుల్ని ఆశయంగా తీసుకుని సంసారం చేసే ఆడాళ్ళయితే అలాంటి బరితెగించిన భర్తలతో సరిపెట్టుకుంటారు. ఇలాంటి బండ భర్త నాకెందుకు అనుకునే భార్య అయితే విడాకుల కోసం దరఖాస్తు పెడుతుంది.

"ఆ((చ్!" రొయ్యమీసాలాయన తుమ్ముతో నా ఆలోచనలకి మరోసారి




ఆటంకం కల్గింది. అప్పటివరకూ ఆయన్ను నేను పట్టించుకోనేలేదు.

'ఆ(((ఛ్'

'ఆఛ్'

'ఆ(((ఛ్'

ఒకటి కాదు, పది కాదు, వంద కాదు. అలా తుమ్ముతూనే వున్నాడాయన — అందుకే జన్మనెత్తినట్లు! ఆయన తువ్వాలంతటి జేబురుమాలు అడ్డుపెట్టుకుని వుండకపోతే ఆ తుమ్ముల వానకి మేం అంతా తడిసిపోయే వాళ్ళమే. అందరూ ముఖాలు చిట్లించారు — అబ్బ! ఏవిటీ న్యూసెన్స్ అన్నట్లు.

"నాకు మల్లెపూవు వాసన సరిపడదండీ. ఎలర్జీ. అందుకనే అలా. ఆఛ్ తుమ్ము... ఆఛ్....క్షమి....ఆఛ్" సంజాయిషీ పూర్తి కాకుండానే తిరిగి తుమ్ముల డ్యూటీలో జాయిన్ అయిపోయాడు రొయ్యమీసాలు.

ఆశ్చర్యంతో నా కనుబొమలు పైకిలేచి అలానే వుండిపోయాయి. నేను నమ్మలేకపోయాను.

ఎన్నో వాసనలు పడకపోవటం విన్నాను కాని పువ్వుల్లో రాణి లాంటివి, మత్తయిన సువాసనతో క్రొత్త దంపతుల్ని మంత్రముగ్ధుల్ని చేసేవి, ప్రతి కవి కలం చివర నిత్యం నాట్యం చేసేది. అలాంటి చక్కని మల్లెపూవులు ఈయన గారికి సరిపడవా? ఆ వాసన తగలగానే వందల వేల తుమ్ముల్ని విసుగు విరామం లేకుండా విడుదల చేస్తాడా మరి ఆయన గారి శోభనం నాడు వాళ్ళావిడ మల్లెపూలు పెట్టుకోలేదా? పెట్టుకుంటే పీకి పారేశాడా? అప్పటికి ఈ జబ్బు వుందో లేదో?

కమ్మరి కొలిమి దగ్గర ఓ అయిదు నిముషాలు నిలబడితే ఆ సమ్మెట శబ్దానికి తల తిరుగుతుంది మనకి. కాని నిత్యం ఆ పనిలో వుండే కమ్మరికి అలవాటయి పోయి కొన్నాళ్ళకసలు ఆ శబ్దం వినిపించదు. దీన్ని "సెలెక్టివ్ డెఫ్‌నెస్" అంటారు. అలాగే నా మనసు కూడా అంత డిస్టర్బెన్స్‌లోనూ నిరాటంకంగా ఆలోచించటానికి అలవాటు పడిపోయింది.

"ఏమిటీ జనం? ఎటు పోతోంది లోకం? ఒకరి వాసన మరొకరికి నచ్చదు. ఎవరి వాసన వారికే గొప్ప. తాను చెప్పిందే కరెక్టు. పేదరికం పట్ల సానుభూతి, దయ లేవు ఐశ్వర్యానికి, పైపెచ్చు చిన్న చూపు. ప్రతి మనిషి తన చుట్టూ గిరి గీసుకుని బ్రతుకుతున్నాడా? పరాయి మనిషిని పశువు కన్నా హీనంగా చూడటం ఈనాటి పడికట్టా? ఈ వ్యాధికి చిన్నపిల్లలు కూడా లొంగిపోయారా? అసలు బాలల మనసులు ఎంతో నిర్మలంగా వుంటాయంటారే? నైతికంగా ఎరుగని మనిషి మరుగుజ్జుగానే వుండిపోయాడా? సహనం, సర్దుబాటు అన్న పదాల్ని మర్చిపోయారా?........."

"దిగండి, దిగండి. అలా దార్లో అడ్డంగా వుంటే ఎలా మేష్టారూ." ఎవరో నన్ను దాటించి తప్పుకోమన్నారు.

ఆఖరి స్టేషన్ అది. అంతా దిగిపోయారు. నేనూ దిగిపోయాను.

"హమ్మయ్య!" అనుకుంటున్నారంతా. వాళ్ళ ముఖాల్లో రిలీఫ్ కనిపిస్తోంది. ఎందుకట 'హమ్మయ్య?' ఎవరి బరు వెవరు మోశారు కనక??

నాకు మాత్రం ప్రయాణం అయిపోయినందుకు విచారమేసింది. ●